మోదీ హోదా ఏదీ..?

దశావతారున్ని సాక్షిగా దశాబ్దం

ప్రజాశక్తి- తిరుపతి సిటి

విభజన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేందుకు ప్రత్యేక హోదా ఇస్తామన్న బిజెపి, ప్రధాని నరేంద్రమోదీ ఆ మాటను విస్మరించారు. దశావతారుడైన శ్రీవెంకటేశ్వరస్వామి పాదాలు సాక్షిగా ఇచ్చిన మాటకు దశాబ్దం అవుతున్నా అమలు చేసిన పాపాన పోలేదు. నేడు ఏ మోహం పెట్టుకుని తిరుపతికి వస్తున్నాడని సామాన్యుడు సూటిగా ప్రశ్నిస్తుండడం గమనార్హం.

అది 2014 దేశవ్యాప్తంగా సాధారణ ఎన్నికలు జరుగుతున్న రోజులు. అప్పటి హైదరాబాదు రాజధానికిగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విడగొట్టి. తెలంగాణ, విభజన ఆంధ్రప్రదేశ్‌గా మార్చింది. పార్లమెంట్ చీకటి గదుల్లో జరిగిన చట్టానికి అన్ని రాజకీయ పార్టీలు పరోక్షంగా, ప్రత్యేక్షంగా మద్దతు తెలిపిన వారే (ఒక సిపిఎం తప్పా). ఆ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు 5 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తున్నట్లు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంట్‌సాక్షిగా ప్రకటించారు. దీంతో పాటు మరెన్ని విభజన హామీలు ఇచ్చారు. అప్పుడు రాష్ట్రానికి చెందిన టిడిపి, బిజెపి సైతం ప్రత్యేక హోదా 5 సంవత్సరాలు కాదు 10 సంవత్సరాలు కావాలని డిమాండు చేశాయి. ఈ నేపథ్యంలో సాధారణ ఎన్నికలో రానే వచ్చాయి. ఏపిలో భారతీయ జనతాపార్టీ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు కలిసి పోటీకి దిగాయి. ఈ సందర్భంగా ప్రపంచ ప్రసిద్దిగాంచిన తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి పేరుతో వెలిసిన శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో జరిగిన ఎన్నికల సభకు ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తిరుమల శ్రీవారిని దర్శంచుకుని, తిరుపతికి చేరుకుని సభలో ప్రసంగిస్తూ తిరుమల శ్రీవారి పాదాల సాక్షిగా త్రాను అధికారంలోకి వస్తే ఏపికి ప్రత్యేక ఇస్తానని హామీ ఇచ్చారు. అప్పడే ఆదే వేదికపై టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్‌కల్యాణ్ కూడా ఉన్నారు. క్యాలెండరు తిరగబడింది. 2019 ఎన్నికలు వచ్చేసరికి బిజెపిని జనసేనాని విమర్శించారు. తిరుపతి సాక్షిగా ఏపికి మోదీ పాసిపోయిన లడ్డులు ఇచ్చాడని ఎద్దేవా చేశారు. మమ్మల్ని బిజెపి మోసం చేసింది. ఆయనదన్ని అపద్దాల హామీలే అంటూ టిడిపి తూర్పార పట్టింది. మళ్లీ ఎన్నికల క్యాలెండరు మారింది. మరో కొన్ని నెలల్లో ఏపిలో ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పదు మళ్లీ కప్పదాటు చేస్తాలు తప్పడం లేదు. బిజెపిని పాసిన లడ్డులు అన్న పవన్ కల్యాణ్ అంటపెట్టుకున్ని, పొత్తు పెట్టుకున్నాడు. టిడిపితో సైతం బిజెపికి పొత్తు పెట్టుకునేలా అనేక చర్చలు జరుగుతున్న విషయం జగమెరిగిన సత్యం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తెలంగాణ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల సభలో పాల్గొంటున్న ప్రదాని నరేంద్ర మోదీ పనిలో పనిగా ఆదివారం తిరుపతికి చేరుకుని, తిరుమల శ్రీవారిని దర్శించుకుని, తిరిగి తెలంగాణకు వెళ్లి ఎన్నికల సభల్లో పాల్గొంటారు. ఇదే తిరుపతికి సాక్షిగా నరేంద్రమోడి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీకి సుమారు దశాబ్దం అవుతోంది. హోదానే కాదు. ప్రత్యేక ప్యాకేజీ, రాయలసీమకు, వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతాలకు నిధులు ఇవ్వలేదు. జాతీయ ప్రాజెక్టుగా చెప్పతున్న పోలవరానికి నిధులు కూడా అంతంత మాత్రమే. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదు. విశాఖ రైల్వే డివిజన్ లేదు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు లేవు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి సహాయం లేదు. అంతెందుకు ఏడాదికి లోటుగా ఉంటున్న 16వేల కోట్ల రూపాయలలో సైతం పైసా ఇచ్చిన దాఖలాలు లేవు. విభజన హామీలన్ని నీటి మూటలయ్యాయి. దీనికి తోడు కొత్తగా ఏమి ఇవ్వకపోగా ఆంధ్రరాష్ట్రానికే తలమానికమైన విశాఖ ఉక్కును సైతం కార్పొరేట్ శక్తులకు అప్పగించారు. ప్రభుత్వరంగ సంస్థలను (రైల్వే, ఎల్ఐసి, బ్యాంకులు, విమానశ్రయాలు, పోర్టులు) ప్రయివేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారు. ఇదేమని ఆడిగే నాథుడే లేదు. అధికారంలో ఉన్న వైసిపి, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి, మిత్రపక్షమైన జనసేన ముగ్గరు ముగ్గరే. మోదీకి మోకరెల్లడంలో ఎవ్వరికి వారు పోటీ పడుతూనే ఉన్నారు. ఇక ప్రశ్నించే దిక్కేది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే స్థితి ఏది. తిరుపతి సాక్షిగా ప్రత్యేకహోదా ఇచ్చిన నరేంద్ర మోదీ దశాబ్దాం తర్వాత శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి ఆదివారం తిరుపతికి రానున్న సందర్భంగా తిరుపతి వాసులు, ఆంధ్ర ప్రజలు తమకు ఇచ్చాన హామీలను అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ఎన్నికల రాజకీయాలు మానీ, ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, రానున్న ఎన్నికల సమయంలోపు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రకటించాలని, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, విభజన హామీలను ఖచ్చితంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏనుగుల దాడిలో నాశనం అయిన టమోటా పంట

ఆగని గజ దాడులు

అన్నదాతలకు భారీ నష్టం

ప్రజాశక్తి- వికోట

గత నాలుగు రోజులుగా అటవీ సరిహద్దు పంట పొలాల్లో చొరబడుతున్న ఏనుగుల దాడులతో పంటలకు అపారనష్టం కలుగుతున్నాయి. పూత, కోత దశ పంటలను నేలమట్టం చేస్తూ అన్నదాతలకు కన్నీళ్లు మిగుల్చుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి మండలంలో ఏనుగుల మంద పంట పొలాలపై విరుచుకుపడ్డాయి. 14 ఏనుగుల గుంపు పంటలను తొక్కి, తిని ధ్వంసం చేస్తున్నాయి. మండల పరిధిలోని తోటకనుమ, కొమ్మరమడుగు, నాగిరెడ్డిపల్లి, వెంకటేపల్లి, దానమయ్య గారిపల్లి, ఎడగురికి, పచ్చారమాకులపల్లి, సికార్లపల్లి అటవీ సరిహద్దు గ్రామల పంటపొలాల్లోకి ఏనుగులు చొరబడి పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పచ్చ రుమాకులపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ ఎకరం పొలంలో టమోటా సాగుచేశారు. శనివారం ఉదయం పంటను కోద్దామని వెళ్లగా ఏనుగులు పంట మొత్తం తిని, తొక్కి నాశనం చేయడంతో రైతు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం టమోటా ధర 10 కిలోలు రూ.500లకు పైగా ఉంది. ఈ దశలో ఏనుగుల గుంపు తోటపై పడి తిని, తొక్కి ధ్వంసం చేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సీకర్లపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం రెండెకరాల్లో టమోటా పంట సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం పూత, పిందె దశలో పంట ఉంది. రాత్రి ఏనుగుల గుంపు దాడితో తీవ్రనష్టం మిగిలిందని వాపోయారు. కొమ్మరమడుగు గ్రామానికి చెందిన కష్ణమూర్తి పంట సాగు చేసేందుకు వేసిన మల్చింగ్ పేపర్‌ను, యడగురి గ్రామానికి చెందిన రైతు అబ్బయ్య అరటి, మామిడి తోటపై దాడిచేసి చెట్లను విరిచేసాయి. నాగిరెడ్డిపల్లి రైతు వెంకటాచలపతి వరి మడిని తొక్కి, తిని నాశనం చేశాయి. అలాగే పలువురి రైతులకు చెందిన పొలాల్లోని డ్రిప్ పరికరాలు ధ్వంసం చేశాయి. మొక్కజొన్న పంటలను తొక్కేసాయి. గజరాజులు నాలుగు రోజులుగా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు ఏ పంటపై పడి ధ్వంసం చేస్తాయో అన్న భయాందోళన రైతుల్లో నెలకొంది. సంబంధిత అటవీ శాఖ అధికారులు సత్వరం స్పందించి ఏనుగులు పంట పొలాలపైకి రాకుండా చర్యలు చేపట్టి పంట నష్టపరిహారాన్ని అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

27 నుంచి జిల్లాలో వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం ఈనెల 27 నుండి 6 ప్రచార వాహనాలతో 60 రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జిల్లా అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ఎంపిడిఓలు, ఇతర సంబంధిత మండలస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడానికి వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని రూపొందించిందని, ఈకార్యక్రమం నవంబర్ 27 నుండి ప్రారంభం కానున్నదన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లాస్థాయి నోడల్ అధికారిగా జెడ్పి సీఈఓ వ్యవహరిస్తారని, జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 6 నియోజకవర్గాలకు 6 వీక్షిత్ భారత్ సంకల్ప్‌యాత్ర వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో వాహనం ప్రతిరోజు రెండు పంచాయతీల్లో డిజిటల్ స్క్రీన్‌లో వీడియోల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమషెడ్యూల్‌ను ఎంపిడిఓలకు పంపడం జరిగిందన్నారు. వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అనుసంధానం చేసుకుని నిర్వహించాలన్నారు. ఎంపిడిఓలు మండలాలలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, పిఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, దీన దయాళ్ అంత్యోదయ యోజన, పిఎం ఆవాస్ యోజన, పిఎం ఉజ్వల్ యోజన, పిఎం విశ్వకర్మ, పిఎం కిసాన్ సమ్మాన్, కిసాన్ క్రెడిట్ కార్డ్, పి ఎం పోషణ్ అభియాన్, జల్ జీవన మిషన్, స్వామిత్వ, జన ధన యోజన, జీవన జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పిఎం ప్రణామ్, నానో ఫెర్టి లైజర్ వంటి 17 సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పథకాల ద్వారా ఇంకనూ లబ్ధి పొందేందుకు అర్హులుంటే వారిని గుర్తించి నమోదు చేసేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మొదట స్వాగతం తరువాత ప్రధానమంత్రి ప్రసంగం, సంకల్ప్ ప్రతిజ్ఞ, లబ్దిదారుల స్పందన, ప్రకతి వ్యవసాయం పద్ధతులను ఆచరిస్తున్న రైతులతో ముఖాముఖి, సాంస్కతిక కార్యక్రమాల నిర్వహణ, గ్రామస్థాయిలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధితో అభివద్ధి చెందిన వారిని సన్మానించడం, విద్యార్థులచే క్విజ్ పోటీల నిర్వహణ, హెల్త్ క్యాంప్‌ల నిర్వహణ, టిబి స్క్రీనింగ్ తదితర కార్యక్రమాలను నిర్వహించేందుకు గ్రామస్థాయిలో పంచాయతీ సెక్రెటరీలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి డాక్యుమెంటేషన్‌లో భాగంగా ఫోటోలు, వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జెడ్పి సీఈవో, విబిఎస్‌వై నోడల్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి, డిఆర్‌డిఏ, డ్వామా, హౌసింగ్ పిడిలు తులసి, గంగా భవానీ, పద్మనాభం, సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మీ, డిపిఓ లక్ష్మీ, పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డిఎస్ఓ శంకరన్, డిఎల్‌డిఓ రవి కుమార్, ఎల్‌డిఎం హరీష్, జిఎం డిఐసి చంద్రశేఖర్, నెహ్రూ యువకేంద్ర కొఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చిన్నారెడ్డి, మూర్తి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అంగన్వాడీల సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- నగరి: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుండి జరిగే రాష్ట్ర సమ్మెను చిత్తూరు జిల్లాలో జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగరి ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనకోటి, కార్యదర్శి పంచవర్ణలు పిలుపునిచ్చారు. శనివారం నగరిలో అంగన్వాడీల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి కొచ్చి నాలుగున్నర సంవత్సరాల పూర్తవుతున్న ఇప్పటివరకు హామీ జోలికి వెళ్లలేదని అన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌తో పాటు కొత్తకొత్త యాపులు తీసుకొచ్చి అంగన్వాడీలపై అదనపు భారం మోపడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలంటే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, హెల్పర్లు ప్రమోషన్లు వయోపరిమితి 50 సంవత్సరాలు పెంచాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 8 నుండి జరిగే సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు.

చౌడేపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుండి జరిగే రాష్ట్ర సమ్మెను చిత్తూరు జిల్లాలో జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పుంగనూరు ప్రాజెక్టు నాయకురాలు కల్పన పిలుపునిచ్చారు. శనివారం చౌడేపల్లిలో అంగన్వాడీలలతో ఆమె మాట్లాడుతూ రాజకీయ జోక్యం అరికట్టాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 8 నుండి జరిగే సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు.

నగరిలో..

చౌడేపల్లిలో..

యువత 'ఓటు' నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నగర పాలక సంస్థ పరిధిలో 18 సంవత్సరాల వయసు పూర్తి చేసుకుంటున్న యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఏఈఆర్వో, కమిషనర్ జె.అరుణ పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హులైన వారు సంబంధిత పోలింగ్ కేంద్రం బిఎల్ఓ వద్ద ఉన్న ఫారం 6 పూర్తిచేసి, వయస్సును ధ్రువీకరించే ధ్రువపత్రం జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ వెబ్సైట్లోనూ ఆన్లైన్లో ఫారం-6 నమోదు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇదే సమయంలో ఇప్పటికే ఓటు హక్కు నమోదు చేసుకున్న వారు పేరు, చిరునామా పొరబాట్ల ఉంటే సరి చేసుకోవడానికి సవరణ దరఖాస్తులు చేసుకోవచ్చుని చెప్పారు. డిసెంబర్ 2,3వ తేదీలలో జరిగే ప్రత్యేక ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని అర్హులైన యువత ఓటరుగా నమోదు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- బంగారుపాల్యం: యుటిఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నట్టు జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మండల యుటిఎఫ్ కమిటీ సభ్యులను ఎన్నికల అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ధనంజయరాజు, అధ్యక్షులుగా మొగలయ్య, ప్రధాన కార్యదర్శిగా మోహన్ రెడ్డి, అసోసియేట్ అధికారిగా అమూల్య, భరత, భూషణ్, కోశాధికారిగా మహేష్‌బాబు, మండల కార్యదర్శిగా బాలాజీ, శివరంజని, బుగ్గయ్య, బాలాజీ, యమునా, చెంగయ్య ఆదిలక్ష్మి, సోను సుమలత, జిల్లా కౌన్సిలర్‌గా మొగిలయ్య, మోహన్‌రెడ్డి, ధనంజయరాజు, సరితలను ఏకగ్రీవంగా ఎన్నుకుని వారిచే సంఘ నిబంధనలో పాటించాలని ప్రమాణస్వీకారం చేపట్టారు.

వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర

ప్రచార వాహనాలను ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని ప్రతి పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తతప్రచారం కొరకు వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార వాహనాలను ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. శనివారం చిత్తూరు గాంధీ విగ్రహం కూడలి నుండి వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార వాహనాలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీని కలెక్టర్ ప్రారంభించగా పివికెఎన్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, జిల్లాస్థాయి అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో విస్తత ప్రచారం కల్పించడానికి సంకల్పించి వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రను ప్రారంభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 60 రోజుల పాటు నిర్దేశించిన ఈయాత్ర ఈ నెల 27 నుంచి జిల్లాలో 6 నియోజకవర్గ పరిధిలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున తిరుగుతాయని, వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర వాహనాలు రోజుకు రెండు పంచాయతీల చొప్పున పకడ్బందీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమ నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం నోడల్ అధికారిని నియమించిందని, త్వరలో జిల్లాలో నోడల్ అధికారి పర్యటిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో జెడ్పి సిఈఓ, మండల స్థాయిలో ఎంపిడిఓలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్జీఓలు సమన్వయం చేసుకుని ప్రజలను భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

అంగన్‌వాడీలకు హామీలు అమలయ్యేనా..?

సమ్మెకు సన్నద్ధమవుతున్న అంగన్‌వాడీలు

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

అంగన్‌వాడీలు లేని ఊరు లేదు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలైన దాఖలాలు లేవు. పసిపిల్లలు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం, పిల్లల ఆలనా పాలన చూపడంలో అంగన్‌వాడీ వర్కర్ల సేవలు కీలకం. కానీ నిత్యం సమస్యలతో సతమతమవడం షరామామూలే. కనీస వేతనాలు కూడా ఇవ్వని పరిస్తితి. ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా వీరి పరిస్థితులు మాత్రం మారలేదు. నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు, వంటావార్పులు చేసిన ఫలితం శూన్యం. విధిలేని పరిస్థితుల్లో సమ్మె బాటపట్టేందుకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెబాట పట్టనుండడం గమనార్హం.

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఐఎస్ఐ గ్రాట్యూటి అమలు తదితర వాటిపై అంగన్‌వాడీలు సంవత్సరాల తరబడి పోరాడుతూనే ఉన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలైన అంగన్‌వాడీల సమస్యలు పరిస్కారం చెయ్యలేదు. పైగా ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్దంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చింది. ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను అనేక రెట్లు పెరిగాయి. కానీ ధరలకు అనుగుణంగా వేతనాలు నయాపైసా కూడా పెంచలేదు. అంగన్‌వాడీల పోరాటాల ఫలితంగా 2018లో వర్కర్లకు 1500, హెల్పర్‌కు రూ.750, మినీ వర్కర్‌కు రూ.1250లు పెంచుతున్నామని ప్రకటన చేసిన ఇంతవరకు అమలు చేయ్యలేదు. 2017 నుంచి టిఎ బిల్లులు ఇవ్వడం లేదు. 2022 ఏఫ్రిల్ 25 అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు 1972 చట్టం ప్రకారం గ్రాట్యూటికి అర్హులని తెలియజేసింది. కానీ అంగన్‌వాడీలకు గ్రాట్యూటి ఇప్పటి వరకు అమలు చేయ్యలేదు. లబ్దిదారులను కుదించడానికి పోషణ ట్రాక్‌యాప్‌ను తీసుకొచ్చింది. ప్రైవేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి వారిపై పనిభారం పెంచారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2023-24వ సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల 26లక్షల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు కోటి మందిగా ఉన్న స్కీం వర్కర్లకు ప్రయోజనం కలగలేదు. ఐసిడిఎస్‌కి నామమాత్రంగా రూ.291.24 కోటు బడ్జెట్ పెంచినప్పటికి పెరుగుతున్న ధరలతో ఇది ఏ మాత్రం సరిపోదు. గత 48 సంవత్సరాల నుంచి గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు కనీసం ఉద్యోగ భద్రత కల్పించలేదు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పరిస్థితి అంతే. అంగన్‌వాడీలకు తెలంగాణా కన్న అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటి మీద రాతగా మిగిలింది. సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్‌వాడీలు నెట్టబడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమీషనర్, ఎంఎస్‌కె, ఎంఆర్ఓ, ఎండివో, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అంగన్‌వాడీలను అవమానిస్తూ, వేధింపులకు గురి చేయడం నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉంది. ఇలాంటి అనేక సమస్యల నడుమ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఇబ్బందులు పడుతూనే, తమ సేవలను అందిస్తున్నారు. పాలకులు తీరులో మార్పు మాత్రం రావడం లేదు. అనేక ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, వంటావార్పులు చేసిన ఫలితం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో డిసెంరు 8 నుంచి నిరవాధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సభలు, సమావేశాలు పెట్టి, అందరిలో చైతన్యం తీసుకొస్తున్నారు. అందులో భాగంగా రెండు రోజుల క్రితం అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ అధ్యక్షతన తిరుపతిలో జిల్లాస్థాయిలో అంగన్‌వాడీ యూనియన్ల రౌండ్‌టేబుల్ నిర్వహించారు. దీనికి సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్.నరసింగరావు ముఖ్యఅతిథిగా హాజరై అంగన్‌వాడీ పోరాటాలకు మద్దతు తెలియజేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి, అంగన్‌వాడీలను ఆదుకుని, వారి నాణ్యమైన డిమాండ్లను పరిస్కరించి, సమ్మెకు వెళ్లనీయకుండా నిలవరిస్తారని ఆశీద్దాం.

భారత రాజ్యాంగం విశిష్టమైంది..

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రపంచంలో భారత రాజ్యాంగం అత్యంత విశిష్టమైనదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో ముందస్తు జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ విభాగం, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ విశిష్టతను తెలియజేప్పారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కార్తీక్, డాక్టర్ ధనుంజయరెడ్డి, సుబ్బారావు, స్వామి శివయ్య, విశ్వనాథరెడ్డి, భార్గవి, లావణ్య, జోగి ప్రసాద్, గోపికృష్ణ పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: స్థానిక సుందర రాజపురం విజయం సిబిఎస్సి పాఠశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు సాంఘిక శాస్త్ర ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాణ కమిటీ నాటిక తో పాటు రాజ్యాంగ సభ విధాన శాసనసభ, కోర్టు భవనాలు, అయోధ్య రామాలయ మందిరం, ఎర్రకోట, సౌర కుటుంబం సేంద్రియ వ్యవసాయం, ఆధునిక నీటి సంరక్షణ వంటి నమూనాలను

ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి , డైరెక్టర్ శైలజ మూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌసల్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

భూ.. అక్రమ ప్రవేశానికి యత్నం

- అడ్డుకున్న బాధిత కుటుంబం
- కోర్టు కేసు ఉండగా ఎలా ప్రవేశిస్తారంటూ ధ్వజం
- దౌర్జన్యంగా జెసిబితో చదును చేస్తున్నారంటూ ఆరోపణ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తమ భూమిలో కొంతమంది అక్రమంగా ప్రవేశించి చదును చేస్తున్నారంటూ మండలంలోని తాతిరెడ్డిపల్లికి చెందిన రమేష్ ఆరోపించారు. శనివారం గంగవరం మండలం గండ్రాజుపల్లి పంచాయతీలోని తమ భూమిలో చదును చేస్తున్న జెసిబిని కుటుంబ సభ్యులతో కలసి రమేష్ అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 268/2లో తమ భూమికి సంబంధించి వివాదం కోర్టులో కేసు నడుస్తోందన్నారు. అయితే కొంతమంది ఆ భూమికి కొనుగోలు చేశామని, అక్రమంగా ప్రవేశించి జెసిబితో చదును చేస్తున్నారని మండిపడ్డారు. అడ్డుకోబోతే బెదిరించి దౌర్జన్య

జెసిబిని అడ్డుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు

చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఈ విషయంగా ఇప్పటికే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

లింగ వివక్షపై అవగాహన ర్యాలీ

పెద్దపంజాణిలో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సమాజంలో లింగ వివక్షత నేరమని వివక్షకు పాల్పడిన వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటారని ఏపిఎం క్రిష్ణప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏపీ సెర్ప్, ఎన్ఆర్ఎల్ఎం, ఎంపిడివో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపిఎం మాట్లాడుతూ నవంబర్ 25 నుండి డిసెంబర్ 25 వరకు లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని, కావున వారిపై వివక్షత చూపరాదన్నారు. వివక్షత పాటించిన వారిపై చట్టబద్ధంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక పోలీసులు తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రషీద్అహ్మద్, సీసీలు, చిన్న, వసంత, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెట్ గణేష్, అంగన్వాడి వర్కరు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సదుం: మండల సమైక్య ఆధ్వర్యంలో శనివారం సదుంలో మహిళా సంఘ సభ్యులు ర్యాలీ, మానవహార నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం హరిప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా గ్రామాలలో సంఘమిత్రలు, మహిళలు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సిసిలు రమేష్, మధుసూదన్‌రెడ్డి తదితరులు

గంగాధరనెల్లూరులో

యాదమరిలో

పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మహిళలపై లింగ వివక్షత విడనాడాలని ఎపిఎం చిరంజీవి అన్నారు. శనివారం డ్వాక్రా మహిళలతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ ఈశ్వర్, సంఘమిత్ర మణి తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: బాల్య వివాహాల వల్ల అనేక సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటికి చరమగీతం పాడాలని ఏపీఎం కల్పలతరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో స్వయం సహాయక సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి మండల సమాఖ్యలో ఈ విషయంగా చర్చ జరిగితే కొంతవరకు సామాజిక రుగ్మతల నునిర్మూలించవచ్చున్నారు. కార్యక్రమంలో సీసీలు వెంకటేష్, బాలకృష్ణ, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌లపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి సెక్టార్లో పని చేస్తున్న 73మంది అంగన్వాడీ వర్కర్లకు మొబైల్ యాప్‌లపై అవగాహన సదస్సు జరిగింది. శనివారం ఎంపిడివో కార్యాలయంలో ఈ సదస్సు జరిగింది. జిల్లా అధికారిణి నస్రీనా ఎఫ్ఆర్ఎస్ యాప్‌నకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లత, రమాదేవి, లక్కనపల్లి సెక్టార్ వెంకటరత్నం, బైరెడ్డిపల్లి సెక్టార్ నిర్మల, శకుంతలమ్మ, వికోట సెక్టార్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సోమల: ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎపివో దినకరబాబు అన్నారు. శనివారం మండలంలోని ఇరికిపెంట సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. పొలాల్లో పలు అభివృద్ధి పనులు, ఉద్యాన పంటల సాగుకు సంబంధించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి జాబ్ కార్డుకు వంద రోజుల పనిని కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, ఎంపిటిసిలు వేముల హరినాథ్, పంచాయతీ కార్యదర్శి మేనక, వైసిపి నాయకులు సూరిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడి సెంటర్లను త్వరితగతిన ఆధునీకరించండి

ఐసిడిఎస్ పిడి నాగ శైలజ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని అంగన్వాడి సెంటర్లను రెండవ దశలో త్వరిగతిన ఆధునికరించాలని జిల్లా ఐసిడిఎస్ పిడి నాగశైలజ అన్నారు. ఎంపీడీవో ఆఫీస్‌లో అంగన్వాడి సెంటర్లపై రెండవ విడతలో నాడు- నేడు పథకం ద్వారా మంజూరైన పనులకు సంబంధించి మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు ద్వారా 29 సెంటర్లను రెండవ దశలో రిపేర్లు, పెయింటింగ్, మంచినీటి

సదుపాయం, మరుగుదొడ్లు, నిర్మాణం ఆధునీకరణ పనులు మొదటి ప్రాధాన్యతగా చేయాలన్నారు. ఇందుకుగాను అంగన్వాడి మదర్స్ కమిటీ, అంగన్వాడీ సూపర్వైజర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనులకు సంబంధించి అంచనా సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీవో వెంకటరెడ్డి, ఏపీడబ్ల్యుఐడిసి శివప్రసాద్, ఎస్ఎస్ఏ మధుసూదన్ రావు, సిడిపిఓ వినతశ్రీ, ఇన్చార్జ్ ఎంపీడీవో సుధాకర్, ఎంఈవోలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్లు అనురాధ, భాగ్యలక్ష్మి, నాగరత్నమ్మ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- యోగానంద విద్యాలయ చైర్మన్ గోపాలజీ అగర్వాల్

ప్రజాశక్తి-శాంతిపురం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పరమహంస యోగానంద విద్యాలయ చైర్మన్ గోపాల్‌జీ అగర్వాల్ అన్నారు. విద్యాలయంలో శనివారం రెండవ రోజు 23వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. చైర్మన్ గోపాల్‌జీ అగర్వాల్, మాజీ రెస్కో చైర్మన్ చక్రపాణిరెడ్డి, కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చైర్మన్ అగర్వాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తుకు సంబంధించిన ముఖ్య విషయాలను తెలియజేసి, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి చక్కగా చదువుకుని, దేశానికి మంచి పేరు తీసుకురావాలని, అదేవిధంగా విద్యాలయానికి జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని, విద్యార్థులను జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రెండవ రోజు వార్షికోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో చక్కగా వివిధ రాష్ట్రాలు –జానపద రీతులు మీద జానపద నృత్యాలతో అందరిని అలరించడం జరిగినది. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్రవిడ విశ్వవిద్యాలయం ఇంఛార్జ్ వీసీగా భారతి

ప్రజాశక్తి-గుడుపల్లి: ద్రవిడ విశ్వవిద్యాలయ ఇంఛార్జ్ వీసీగా భారతి నియమితులైయ్యారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీగా ఉన్న భారతిని ద్రవిడ యూనివర్సిటీ బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: దృష్టి లోపం ఉన్న 26మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి విజయలక్ష్మి తెలిపారు. శనివారం మండలంలోని కందూరు జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశామన్నారు. వీరికి ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌వో కుమార్, హెచ్ఎం వెంకటనరమణారెడ్డి, సూపర్‌వైజర్ ప్రమీళ, సిబ్బంది కళ్యాణి, రెడ్డిరాణి, హేమావతి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పేగలవారిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శివరత్నమ్మ శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి, విద్యార్థుల హాజరు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంకి సంబంధించి పరిశీలించారు. కాగా విద్యా బోధనకు సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు.

వృద్ధుల పట్ల దయగా ఉండాలి

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఆశ్రమంలో వృద్ధుల పట్ల దయాగా ఉండాలని, వారిని తల్లిదండ్రులతో సమానంగా చూడాలని ఎంఈవో విజయకుమార్ అన్నారు. శనివారం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఎంఈవో జన్మదినం సందర్భంగా వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాబర్ట్, గిరి, గణేష్, రాస్ పర్యవేక్షకులు ప్రకాష్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: వేణుగోపాలస్వామి ఆలయంలో దాత గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేపట్టారు. శనివారం ఆలయంలో విశేష పూజలు చేశారు. తదుపరి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో టిటిడి ఆలయ అధికారి సురేష్‌కుమార్, లోకయ్య, బంగారమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-కార్వేటినగరం: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు వాసుదేవరెడ్డి, బిసి సంఘం అధ్యక్షులు రవియాదవ్ అన్నారు. శనివారం కార్వేటినగరంలో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మిని మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సందాని, కిషోర్, హరి పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఉన్నతంగా రాణించాలి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ప్రజాశక్తి-చౌడేపల్లి: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఉన్నతంగా రాణించాలని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అండర్ 17 కబడ్డీ అంతర్ జిల్లాల పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. క్రీడాకారులనుద్దేశించి ప్రసంగించారు. ఎంపిపి గాజుల రామ్మూర్తి, నాయకులు కిషోర్, సుధాకర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, శ్రీరామ్ భరత్, జీవన ప్రకాష్, లీలాకుమార్, భానుమూర్తి, తహశీల్దార్ మాధవరాజు, ఎంపిడివో రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో క్విట్ ఇండియా ముగింపు వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జెడ్పి ఉన్నత పాఠశాలలో శనివారం క్విట్ ఇండియా ముగింపు వారోత్సవాలు హెచ్ఎం సోమశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు క్విజ్, యోగా, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులకు వక్తలు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు లక్ష్మీపతి, విజయ్

చంద్రిక, సునీత, వెంకటరాజు, జ్ఞానప్రసాద్, వెంకటేశు, గోపి, విజయవర్మ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దిశాయాప్ పట్ల అవగాహన

ప్రజాశక్తి-సదుం: గ్రామాలలో మహిళలు దిశా యాప్‌లపై అవగాహన కలిగి ఉండాలని రెడ్డివారిపల్లి సర్పంచ్ హనుమంత్‌రెడ్డి అన్నారు. శనివారం పంచాయతీలోని వివిద గ్రామాలలో ఆయన మహిళా సంఘాలతో కలసి పర్యటించారు. దిశాయాప్ ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి,

నాయకులు మోహన్‌రెడ్డి, ఆనందరెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణశారద అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యను అర్థం చేసుకొని చదవాలని విద్యార్థులకు సూచించారు. గత విద్యార్థులు నూతన విద్యార్థులకు అనుభవాలను

తెలుపుతూ సాకారమందించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, డాక్టర్ భరణినాథ్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, లత పాల్గొన్నారు.

సమాజంలో మార్పు తీసుకురావాలి

సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్వయం సహాయక సంఘ సభ్యులు సమాజంలో మార్పు తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరులోని జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య

సమావేశం చిత్తూరు డిఆర్‌డిఏ పీడీ తులసి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న ఆకత్యాలకు అడ్డుకట్ట వేయాలంటే సమాజం చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో స్వయం సహాయ సంఘసభ్యుల పాత్ర కీలకంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఇంకా అనేక చోట్ల బాల్యవివాహాలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. డిఆర్‌డిఏ పిడి తులసి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటికి చరమగీతం పాడాలన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘ సభ్యులు ర్యాలీతోపాటు మానవహారం నిర్వహించారు. డిపిఎంలు వెంకటేష్, రవి, ఏపీఎంలో సూరి, ఖాదరవల్లి, అనురాధ, జ్యోతి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గాంధీరెడ్డి, జయరాముడు, జిల్లా సమాఖ్య సంఘ ప్రతినిధులు, డిఆర్‌డిఏ సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సోమల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్ఐ వెంకటనరసింహులు అన్నారు. శనివారం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, ఏటిఎం మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చిన్నారులకు సెల్‌ఫోన్‌లు ఇవ్వడం ద్వారా జరిగే అనర్థాలను ఆయన వివరించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

విద్యుదాఘాతానికి పాడి ఆవు మృతి

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యుదాఘాతానికి పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని కోదండరామాపురం సమీపంలో చోటు చేసుకుంది. శనివారం మేతకు వెళ్లిన ఆవు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కి గురైనట్లు స్థానికులు తెలిపారు. రైతు ఏళుమలైకి జీవనాధారంగా ఉన్న పాడి ఆవు మృతి చెందింది. ఆవు సుమారు రూ.70వేలు ఉంటుందని అంచనా. ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకంగా ఉండటంతో ప్రమాదం చేసుకున్నట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రైతుకు పరిహారం చెల్లించాలని కోరారు.

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ

ఫైలు సంఖ్య నెం.388/జి1/2021 తేది:25-11-2023

ముసాయిదా ప్రకటన

ఆంధ్ర రాష్ట్ర మహా నగర ప్రాంతము మరియు పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతము అభివృద్ధి చట్టము, 2016, ఉపచట్టము 15 ప్రకారం ఈ క్రింద తెలిపిన భూవినియోగ మార్పు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ప్రాంతమునకు ప్ర.ఉ.112, పు.పా.శాఖ తేది: 08.03.2019నను సవరించి ప్రతిపాదించబడమైనది. ఈ ముసాయిదా ప్రకటన వెలువడిన 15 (పదహైదు రోజుల లోపల) ఈ క్రింద తెలిపిన భూ వినియోగ మార్పు వలన, వ్యక్తులు లేదా సంస్థకు అభ్యంతరములు లేదా సలహాలను ఉపాధ్యక్షులు, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ,తిరుపతి - 517501 వారికి వ్రాత పూర్వకముగా తెలిపిన, విషయములను, ముఖ్య కార్యదర్శి పురపాలక పరిపాలనా మరియు పట్టణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర ప్రభుత్వము, సచివాలయము, వెలగపూడి, గుంటూరు వారికి వారి పరిశీలన మరియు తగు చర్యల నిమిత్తము పంపబడునని తెలియజేయడమైనది.

భూ వినియోగ మార్పు ముసాయిదా ప్రకటన

ప్ర.ఉ.సంఖ్య 112, పు.పా.శాఖ తేది: 08.03.2019 నందు బృహత్ ప్రణాళికా యందు తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ భూ వినియోగ ఆమోదము పొందిన ప్లాను నందు వడమాలపేట మండలములోని యస్.వి.పురము గ్రామములోని సర్వేనెం.411/1,2,3 మరియు 428/1,2,3లో 31 ఎకరములు 14 సెంట్లు విస్తీర్ణము నిరుపయోగము, కొండలు, గుట్టము మరియు బీడు భూమిగా వున్న ప్రాంతముగా వున్నది. సదరు స్థలమును నిరుపయోగము, కొండలు, గుట్టలు మరియు బీడు భూమి నుండి మరియు నివాస ఉపయోగమునకు మార్పు చేయుటకు, సవరించిన మాస్టర్ ప్లాన్ యం.యం.పి. సంఖ్య 02/2023 తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, ద్వారా ప్రతిపాదించడమైనది. సదరు ముసాయిదా భూ వినియోగ మార్పు ప్లాను సంఖ్య 02/2023 తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి కార్యాలయములో పనిదినముల వేళలయందు ప్రజలు సందర్శించి పరిశీలించుటకు ఏర్పాటు చేయడమైనది.

భూ వినియోగ మార్పు భూమి హద్దులు, "A,B,C,D-A" & "EFGHIJ-E"

గ్రామ లెక్కదాఖల	సర్వేనెం.411	సర్వేనెం.428
ఉత్తరము	సర్వేనెం.102(పి)	సర్వేనెం.424 మరియు ప్రతిపాదించబడిన రోడ్డు
దక్షిణము	సర్వేనెం.423(పి), 424 మరియు ప్రతిపాదించబడిన రోడ్డు	సర్వేనెం.417(పి)
తూర్పు	సర్వేనెం.102(పి) & 424(పి)	ప్రస్తుతము ఉన్న 60మీ. వెడల్పు (జాతీయ రహదారి 205) తిరుపతి నుండి చెన్నై జాతీయ రహదారి
పడమర	సర్వేనెం.423(పి)	సర్వేనెం.418(పి) మరియు సర్వేనెం.102(పి)

సం/- యస్.హరికృష్ణ, యం.ఏ, యం.ఫిల్,
ఉపాధ్యక్షులు, తుడా, తిరుపతి